సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



ఈతకోసం దిగి..

ఈత సరదా బాలుడి ప్రాణాలు బలిగొంది. ఈ విషాద ఘటన మండల కేంద్రమైన హుకుంపేటలో చోటుచేసుకుంది. 8లో



కిండలం బాధితులకు సాయం

కిండలంలో బాధితులకు ప్రభుత్వం తరఫున రూ.10 వేల చొప్పున సాయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. 8లో



ఈదురుగాలుల బీభత్సం

దొడిపుట్టు పంచాయతీ జీడీచంపా గ్రామంలో ఈదురు గాలులకు పాఠశాల రేకుల షెడ్డు నేలమట్టమైంది. 8లో

న్యూస్‌రీల్

29న నవోదయ ప్రవేశపరీక్ష

ఎటపాక: ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం బుధవారం తెలిపారు. శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 17 పరీక్ష కేంద్రాల్లో 3,516 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులు www. navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

చింతపండుతో కళకళ



డముకు వారపు సంతకు వచ్చిన చింతపండు

అనంతగిరి: మండలంలోని బుధవారం డముకు వారపు సంతలో విక్రయించేందుకు గిరిజనులు భారీగా చింతపండు తీసుకువచ్చారు. జీసీసీతోపాటు, వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం కిలో రూ.30 నుంచి 32 వరకు ధర పలుకుతోంది. ఎస్‌ఆర్‌పురం, గుమ్మకోట, నిమ్మలపాడు, పెదబిడ్డ, గుమ్మ పంచాయతీలకు చెందిన గిరిజనులు పెద్ద ఎత్తున తీసుకువచ్చి విక్రయించారు.

గంజాయి వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

చింతూరు: ఇటీవల మోతుగూడెంలో సంచలనం సృష్టించిన గంజాయి వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చింతూరు ఏఎస్పీ కేవీ.మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల గంజాయి లోడుతో వెళుతున్న కారును మోతుగూడెం పోలీసులు వదిలేయగా నెల్లూరు ఎస్‌ఈబీ అధికారులకు పట్టుబడటం తెలిసిందే. ఈ ఘటనలో ప్రమేయమున్న ఎస్‌ఐ సత్తిబాబు పరారీలో ఉండగా ఆయనతో సహా ముగ్గురిపై మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఈ వ్యవహారంతో ప్రమేయమున్న కానిస్టేబుల్ శివతో పాటు మరో ప్రైవేటు వ్యక్తి మణిని అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు


జి.మాడుగుల: కారులో తరలిస్తున్న గంజాయిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. జి.మాడుగుల– సింగర్బ, నుర్మతి రోడ్డు మార్గంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీల్లో భాగంగా కారును పరిశీలించగా గంజాయి పట్టుబడింది. కారులో ఉన్న రాజస్తాన్‌కు చెందిన కైలాస్ పూరీ గోస్వామి, రత్నలాల్ జెట్, జి.మాడుగుల మండలం భీరం పంచాయతీకి చెందిన కిల్లో చంద్రబాబును అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి 25 కిలోల గంజాయి, రూ.లక్ష నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వారు పేర్కొన్నారు. ఈ మేరకు కారును సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విశాఖ–కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్




తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఈ సీజన్‌లో అరకు వెళ్లే రైల్వే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం–కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో మే 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(08551)రైలుకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో మే 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31 తేదీల్లో బయల్దేరే కిరండూల్–విశాఖపట్నం(08552)రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

బాలికలదే పైచేయి







- ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ
- ఫస్టియర్‌లో 63 శాతం, సెకండియర్‌లో 70 శాతం ఉత్తీర్ణత
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా గతంలో కంటే కాస్తా మెరుగుపడింది. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరం పరీక్షలకు 50,647 మంది హాజరుకాగా 31,957 మంది పాసయ్యారు. రెండో సంవత్సరం 42,248 మంది పరీక్షలు రాయగా 29,755 మంది పాసయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు రాష్ట్ర సూచికలో మొదటి సంవత్సరంలో ఐదో స్థానం, రెండో సంవత్సరం ఫలితాల్లో ఆరో స్థానం దక్కింది.

రెండింటిలోనూ బాలికలే..

ఫలితాల్లో బాలురు కంటే బాలికలదే పైచేయిగా నిలిచింది. మొదటి సంవత్సరం బాలురు 25,806 మంది పరీక్షలకు హాజరుకాగా 15,835 మంది పాసయ్యారు. తద్వారా 61 శాతం నమోదైంది. బాలికలు 24,841 మంది పరీక్ష రాయగా 16,122 మంది పాసయ్యారు. 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం బాలురు 20,459 మంది పరీక్ష రాయగా 14,017 మంది పాసయ్యారు. తద్వారా 69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 21,789 మంది పరీక్ష రాయగా 15,738 మంది పాసయ్యారు. తద్వారా 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో బాలుర కంటే బాలికలే ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్‌లోనూ అమ్మాయిలే టాప్

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో 1,458 మంది బాలురు పరీక్ష రాయగా 504 మంది పాసయ్యారు. 35 శాతం ఉత్తీర్ణత వచ్చింది. బాలికలు 2,922 మందికి గాను 1,705 మంది పాసయ్యారు. 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో బాలురు 1,215 మందికి గాను 644 మంది పాసయ్యారు. 53 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 2,568 మందికి గాను 1,987 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 77 శాతం నమోదైంది.

మెరుగుపడిన ఉత్తీర్ణత

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే కొంత మెరుగ్గా ఉంది. 2021–22లో మొదటి సంవత్సరంలో 59 శాతం ఫలితాలు వస్తే, 2022–23(ఈ ఏడాది)లో 63 శాతం సాధించారు. రెండో సంవత్సరం గతేడాది 65 శాతం ఫలితాలు రాగా ఈ ఏడాది 70 శాతం ఫలితాలు సాధించారు. ఇంటర్మీడియెట్ తరగతుల నిర్వహణలో అధికారులు చూపిన ప్రత్యేక కృషి ఫలితంగానే కాస్తా ఫలితాలు మెరుగుపడినట్లయింది.

ప్రభుత్వ కాలేజీల్లో మిశ్రమ ఫలితాలు

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 38 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 5,787 మంది హాజరు కాగా 1,199 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 20.72 శాతం నమోదైంది. రోలుగుంట 60.29 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, అనంతగిరి, ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఏ ఒక్కరు కూడా పాసవ్వలేదు. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 6,043 మంది హాజరు కాగా 1,970 మంది ఉత్తీర్ణులయ్యారు. జి.మాడుగుల 67.11 శాతం ఉత్తీర్ణతతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో టాప్‌గా నిలిచింది.

కూనవరం: ఇంటర్ ఫలితాల్లో ఏపీ గురుకుల బాలిక పాఠశాల ఉత్తీర్ణతలో ప్రథమ స్థానంలో నిలిచింది. కళాశాలలో ప్రథమ సంవత్సరం 87మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా 66 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 158 మందికి 107 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని కె.ప్రమీల 1000 మార్కులకు 957 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కూనవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థిని ఎండీ హీనా పర్వీన్ సీఈసీలో 500 మార్కులకు 422 మార్కులు సాధించింది. మండల వ్యాప్తంగా మూడు కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 49 శాతం, ద్వితీయ సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ బాలరాజు తెలిపారు.

మెరిసిన ఏకలవ్య విద్యార్థి

గూడెంకొత్తవీధి: ఇంటర్ పరీక్షల్లో మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలకు చెందిన విద్యార్థి సీహెచ్ మనోహర్ అత్యధికంగా 952 మార్కులు సాధించాడు. ఈ కళాశాల నుంచి 84 మంది పరీక్షలు హాజరుకాగా 66 మంది ఉత్తీర్ణులయ్యారు. 78.57 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు. మనోహర్‌ను ఆయనతోపాటు అధ్యాపకులు అభినందించారు.



మనోహర్

ఆనందం.. అంతలోనే విషాదం



సంఘటన స్థలంలో కారులోంచి క్షతగాత్రులు, మృతదేహాలను బయటకు తీస్తున్న వాహనదారులు

సొంతూరిలో గ్రామదేవత ఉత్సవాలకు హాజరైన ఓ కుటుంబం గమ్యానికి చేరుకోకుండానే మృత్యువు దారికాసి కబళించింది. కారు ప్రమాద రూపంలో ముగ్గురి ప్రాణాలను బలిగొంది. అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టిన కారు లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరు సంఘటన స్థలంలోను మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పాడేరు– చోడవరం ప్రధాన రహదారిలోని కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్ద బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది.

- అదుపు తప్పిన కారు
- రక్షణగోడను ఢీకొని లోయలోకి దూసుకెళ్లిన వాహనం
- సంఘటన స్థలంలో ఇద్దరు, ఆస్పత్రిలో మరొకరు మృతి
- ప్రాణాలు కోల్పోయిన వారిలో దంపతులు
- మృతుల్లో సుబ్బారావు విశాఖలో ఎల్‌ఐసీ డివిజనల్ మేనేజర్

పాడేరు రూరల్ : జిల్లాలోని ముంచంగిపుట్టు మండలం కిలగాడ గ్రామానికి చెందిన చెండా సుబ్బారావు(55), భార్య మహేశ్వరి(50) విశాఖ నగరంలోని పెదవాల్తేరు దరి పోలమాంబ ఆలయానికి సమీపంలోని ఎల్‌ఐసీ క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. చెండా సుబ్బారావు విశాఖలో ఎల్‌ఐసీ కార్యాలయంలో డివిజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

కిలగాడలోని గంగమ్మతల్లి ఉత్సవాలకు..

స్వగ్రామం కిలగాడలో మంగళవారం జరిగిన గంగమ్మతల్లి పండగకు భార్యాభర్తలు చెండా సుబ్బారావు, మహేశ్వరి విశాఖ నుంచి కారులో వచ్చారు. పండగ ముగియడంతో బుధవారం సాయంత్రం సుబ్బారావు, మహేశ్వరితోపాటు బంధువు సమరెడ్డి పూర్ణచంద్రరావు కారులో విశాఖ బయలుదేరారు. పాడేరు– చోడవరం ప్రధాన రహదారిలోని కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టింది. లోయలోకి దూసుకుపోయింది. సంఘటన స్థలంలోనే తీవ్రంగా గాయపడిన మహేశ్వరితో పాటు కారు డ్రైవర్ కంద్రాపు ఉమామహేశ్వరరెడ్డి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సుబ్బారావు, సమరెడ్డి పూర్ణచంద్రరావును వాహనదారులు బయటకు తీశారు. 108 వాహనంలో పాడేరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కారు డ్రైవర్ విశాఖలోని రెడ్డి కంచరపాలెంకు చెందిన వ్యక్తిగా వారు పేర్కొన్నారు. పూర్ణచంద్రరావు ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సంఘటన స్థలంలోని మహేశ్వరి, కారు డ్రైవర్ ఉమామహేశ్వరరెడ్డి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు సుబ్బారావు, మహేశ్వరికి ఇద్దరు సంతానం ఉన్నారని కిలగాడ గ్రామస్తులు తెలిపారు.



సుబ్బారావు మృతదేహం



దంపతుల పాత చిత్రం

పథకాలు పక్కాగా అమలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలు పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి దివ్యాంగుల సంక్షేమ, స్వయం సహాయక పథకాలు అమలుపై అధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో దివ్యాంగులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. దివ్యాంగుల పథకాల అమలు పర్యవేక్షణకు ప్రతీ శాఖలో ఒక నోడల్ అధికారిని నియమించినట్టు చెప్పారు. అనంతగిరి, అరకువ్యాలీ మండలాల్లో సదరం క్యాంపులు నిర్వహించాలని సూచించారు. దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. వికలాంగుల హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బడిబయట ఉన్న దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీఈవోను ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లల గురించి మాట్లాడేటప్పుడు విభిన్న ప్రతిభావంతులైన పిల్లలు గురించి చర్చించాలని చెప్పారు. జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల సమాచారం సేకరించాలని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జె.మాధవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ కార్డులు జారీ చేస్తుందన్నారు. ఇవి కావాల్సిన వారు గ్రామసచివాలయాలు, మీసేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్డులు అన్నివిధాలా విభిన్న ప్రతిభావంతులకు ఉపయోగపడతాయని అన్నారు. యూడీఐడీ గుర్తింపు కార్డులు పొందే విధానంపై రూపొందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా, ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, జిల్లా వైద్యాధికారి డా.జమాల్‌బాషా, డీఈవో సలీంబాషా, ఈఈపీఆర్ కె.లావణ్యకుమార్, డీఆర్‌డీఏ పీడీ మురళి, రోడ్లు భవనాలశాఖ ఈఈ బాల సుందరబాబు, శ్రేయా ఫౌండేషన్షన్ ప్రతినిధి డాక్టర్ ఉషా పాల్గొన్నారు.



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

7,550 మందికి వసతి దీవెన

- తల్లుల ఖాతాల్లో రూ.7,25,42,000 జమ
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో 7,550 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జగనన్న వసతి దీవెన ఆర్థికసాయం రూ.7కోట్ల 25లక్షల 42 వేలు ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పల వేదికగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో లబ్ధిదారులు, అధికారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో వినూత్నమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని సూచించారు. జిల్లాలో 5,545 మంది గిరిజన విద్యార్థులకు రూ.5కోట్ల 35లక్షల 12వేల 500, ఎస్సీ విద్యార్థులు 314 మందికి రూ.29 లక్షల 22 వేల 500, బీసీ విద్యార్థులు 1228 మందికి రూ.1కోటి 16 లక్షల 60 వేలు, ఈబీసీ విద్యార్థులు 128 మందికి రూ.12లక్షల 25 వేలు, కాపు విద్యార్థులు 280 మందికి రూ.26లక్షల 97వేల 500 చొప్పున వారి తల్లుల ఖాతాల్లో జమ అయినట్టు తెలిపారు. వీరితోపాటు 10 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.లక్ష, 45 మంది ముస్లిం మైనారిటీలకు రూ.4 లక్షల 25 వేల చొప్పున ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ వివరించారు. ఈ మేరకు నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు ఐ.కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్. రజని, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, చీంతలవీధి సర్పంచ్ సీతమ్మ, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వసతి దీవెన నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పారదర్శకంగా స్ట్రక్చర్ సర్వే

కూనవరం: పోలవరం నిర్వాసితుల గృహాల సర్వే పారదర్శకంగా ఉండాలని, నిర్వాసితుని ప్రతీ ఇంటిని సమగ్రంగా సర్వే చేయాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జావిజయ అన్నారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపులో ప్రాధాన్య ప్రాతిపదికన గుర్తించిన ఏడు గ్రామాల్లో ప్రారంభమైన స్ట్రక్చర్ (గృహాల) సర్వేను బుధవారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కన్నతల్లిని, ఉన్న ఊరును వదిలి వెళ్లే నిర్వాసితులకు ఏమాత్రం అన్యాయం జరగరాదని, ఈమేరకు అధికారులు కృషిచేయాలని కోరారు. ఇంటి సరిహద్దుల గుర్తింపు, రేకులషెడ్డు, ఆర్‌సీసీ బిల్డింగ్, తాటాకు ఇల్లు, బాత్‌రూమ్‌లు, చెట్లు నమోదును సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, విఆర్‌ఓలు, సర్వే బృందాలు పాల్గొన్నారు.



కూనవరంలో నిర్వహిస్తున్న స్ట్రక్చర్ సర్వేలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ



స్నోయగం

అరకులోయ రూరల్: పర్యాటక కేంద్రమైన అరకులోయలో వారం రోజుల నుంచి వాతావరణం పూర్తిగా మారిపోయింది. వర్షాల వల్ల ఉదయం మంచు దట్టంగా కురుస్తూ శీతాకాలాన్ని తలపిస్తోంది. పర్యాటక ప్రాంతానికి శోభనిస్తోంది. ఇక్కడికి వచ్చే సందర్శకులు ప్రకృతి అందాలను చూసి మంత్రముగ్ధులవుతున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించండి

డీటీసీవో విశ్వేశ్వరనాయుడు



రికార్డులు పరిశీలిస్తున్న డీటీసీవో విశ్వేశ్వరనాయుడు

కొయ్యూరు: క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ అనుమానిత కేసుల విషయంలో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి (డీటీసీవో) విశ్వేశ్వరనాయుడు సూచించారు. బుధవారం రాజేంద్రపాలెం ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆయన టీబీ పరీక్షల రికార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలకు వెళ్లినప్పుడు నిరంతరం దగ్గుతో బాధపడుతూ బలహీన పడుతున్న వారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీసీ శ్రీనివాస్, టీబీ కన్సల్టెంట్ విఘ్నేష్, రాజేంద్రపాలెం వైద్యాధికారులు సంపత్‌కుమార్, మనోజ్ఞ, సీహెచ్‌వో ప్రశాంత్, పీహెచ్‌ఎన్ భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం ఓఎస్‌డీగా మహేశ్వరరెడ్డి



రంపచోడవరం ఓఎస్డీగా నియమితులైన మహేశ్వరరెడ్డి



రంపచోడవరం ఏఎస్పీగా నియమితులైన జగదీష్ అడహళ్లి



చింతూరు ఏఎస్పీగా నియమితులైన రాహుల్‌మీనా

ఏఎస్పీలుగా జగదీష్ అడహళ్లి, రాహుల్‌మీనా

రంపచోడవరం/చింతూరు: రంపచోడవరం ఓఎస్డీగా కేవీ మహేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ ఓఎస్డీగా పనిచేసిన కృష్ణకాంత్ పదోన్నతిపై కర్నూలు ఎస్పీగా నియమితులయ్యారు. దీంతో చింతూరు ఏఎస్పీగా పనిచేస్తున్న మహేశ్వరరెడ్డిని రంపచోడవరం ఓఎస్డీగా ప్రభుత్వం నియమించింది. ఆయన స్థానంలో 2019 బ్యాచ్‌కు చెందిన రాహుల్‌మీనా నియమితులయ్యారు. రంపచోడవరం ఏఎస్పీగా 2020 బ్యాచ్‌కు చెందిన జగదీష్ అడహళ్లి నియమితులయ్యారు. ప్రస్తుతం ఏఎస్పీగా పనిచేస్తున్న ఆదిరాజ్ రాణా ఆదోని ఏఎస్పీగా బదిలీ అయ్యారు. దీంతో ప్రస్తుతం అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్న జగదీష్ రంపచోడవరం ఏఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

రాజవొమ్మంగి: పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని నెల్లిమెట్ల గ్రామానికి చెందిన గిరిజన మహిళ తాము బేబీ రాణి (30) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె ఈనెల 20వ తేదీన ఇంటి వద్ద పెట్రోలు వంటిపై పోసుకొని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు యత్నించడం తెలిసిందే. లాగరాయి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం ఆమెను కాకినాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.



బేబీరాణి (ఫైల్)

క్లుప్తంగా

సీజేఏసీ గౌరవాధ్యక్షుడిగా తిమోతిరాజు



పత్రం అందుకుంటున్న తిమోతిరాజు

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ పెదరాబ బైబిల్ రాక్ అసెంబ్లీ చర్చ్ పాస్టర్ గంపరాయి తిమోతిరాజు, జాతీయ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని పెంతుకోస్తు ప్రార్థన మందిరంలోని బుధవారం జాతీయ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు జాషువ దానియేలు 26 జిల్లాలకు చెందిన పాస్టర్లతో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గంపరాయి తిమోతిరాజును గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా గంపరాయితి తిమోతిరాజు మాట్లాడుతూ క్రిస్టియన్ హక్కుల సాధనకు ప్రత్యేక కృషి చేస్తానని, గౌరవ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి ఉత్తరాంధ్ర టెన్నిస్ డబుల్ టోర్నమెంట్

అనకాపల్లి టౌన్: స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో ఉత్తరాంధ్ర స్థాయి టెన్నిస్ డబుల్ టోర్నమెంట్‌ను (45 సంవత్సరాలు పైబడిన పురుషులకు) ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.గాంధీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు అందజేస్తామన్నారు. ఉదయం, సాయంత్రం (ఫ్లడ్ లైట్ వెలుగుల్లో) క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440357499 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరు కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: విశాఖలో బుధవారం ఆరు కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 231 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురికి కరోనా నిర్ధారణ జరిగింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 42కి చేరింది. 11 డిశ్చార్జ్ అయ్యారు. 42 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు వివరించారు. 36 మంది హోం ఐసోలేషన్ ఉండగా, ఆరుగురు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఈత కోసం దిగి..



మృతదేహం వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



ఘటన స్థలంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

- ప్రాణాలు కోల్పోయిన బాలుడు
- భారీగా నిలిచిపోయిన వర్షపు నీటిలో కూరుకుపోయి మృతి
- జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబం ఆరోపణ
- ఆదుకోవాలని మృతదేహంతో ఆందోళన
- రూ.4 లక్షల నష్ట పరిహారం చెల్లించేలా ఐటీడీఏ పీవో అభిషేక్ చర్యలు

హుకుంపేట: ఈత సరదా బాలుడి ప్రాణాలు బలిగొంది. ఈ విషాద ఘటన మండల కేంద్రమైన హుకుంపేటలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మజ్జి జ్ఞానదీప్ (10) మంగళవారం సాయంత్రం తోటి స్నేహితులతో హుకుంపేట సమీపంలో నిర్మిస్తున్న జాతీయరహదారి వద్దకు వెళ్లాడు. పక్కనే పొలాల్లో భారీగా నిలిచి పోయిన వర్షపు నీటిలో దిగి గల్లంతయ్యాడు. ఇంటినుంచి వెళ్లిన జ్ఞానదీప్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఇంతలో జాతీయ రహదారిపై చెప్పులు, దుస్తులు ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే వారికి సమాచారం అందించారు. దీంతో తండ్రి మజ్జి కృష్ణ, పలువురు అక్కడికి చేరుకుని నిలిచిపోయిన వర్షపు నీటిలో గాలింపు చేపట్టారు. అయినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టి బురదలో కూరుకుపోయిన బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. జ్ఞానదీప్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు.



జ్ఞానదీప్ (ఫైల్)

జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం

జాతీయ రహదారి (516ఈ) అధికారుల నిర్లక్ష్యమే తమ కుమారుడు ప్రమాదానికి గురై మృతి చెందడానికి కారణమని జ్ఞానదీప్ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. జాతీయరహదారి నిర్మాణంలో నీరు పోయే మార్గం ఏర్పాటుచేయకపోవడంతో భారీగా నిలిచిపోయిందన్నారు. అందులో దిగడం వల్ల ప్రమాదానికి గురై మృతి చెందాడని వారు కన్నీటి పర్యంతమయ్యారు. గత వారం కురిసిన వర్షాలకు రహదారి పక్కన, పొలాల్లోను భారీగా నీరు చేరిందని, ఈ నీరు పోయేలా కాంట్రాక్టర్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని గిరిజన సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

మృతదేహంతో ఆందోళన

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే బాలుడు మృతి చెందాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలుడి కుటుంబ సభ్యులు, గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారిపై బాలుడి మృతదేహంతో ఆందోళన నిర్వహించారు.

రూ.4 లక్షల పరిహారం

ఐటీడీఏ పీవో అభిషేక్ సంఘటన స్థలానికి చేరుకుని జాతీయ రహదారి అధికారులతో మాట్లాడారు. మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ.4లక్షలు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు ఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీంతో బాలుడు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సీఐ సుధాకార్, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు



వి.శ్వేతా కుమారి (977, ఎంపీసీ)



సోమేల దీప్తిఫ్లోరెన్స్ (976, ఎంపీసీ)



బి.మేఘన (958, బైపీసీ)

మధురవాడ: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. రెండో సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించారు. ఎంపీసీలో వంజారి శ్వేతా కుమారి 977 మార్కులు, సోమెల దీప్తిఫ్లోరెన్స్ 976, సాధించి అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీలో బొడ్డ మేఘన 958 మార్కులు, మరో 11 మంది 950కి పైగా మార్కులు, 22 మంది 900కిపైగా సాధించారు. ప్రథమ సంవత్సరంలో 81 మంది విద్యార్థులకు 76 మంది ఉత్తీర్ణత సాధించినట్లు (94 శాతం) ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు చెప్పారు. ఎంపీసీలో పత్తిక శ్రావ్యలక్ష్మి, కొట్టిక దీపిక 457 మార్కులు, సెగ్గి తేజస్విని 450 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 20 మంది 400పైగా మార్కులు సాధించారు.

వైఎస్సార్ కంటి వెలుగును వినియోగించుకోండి

- కంటి వైద్య శిబిరంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కశింకోటలో కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో ఎంపిక చేసిన కంటి శుక్లాలు ఉన్న వారికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్టు తెలిపారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 160 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి, వారిలో 35 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యాధికారి జాక్సన్, సమన్వయకర్త అరుణ్‌కుమార్, సిబ్బంది శిబిరంలో సేవలందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సహకారంలో జరిగిన శిబిరంలో సర్పంచ్ మంత్రి జయరజని, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివిధ కేసుల్లో ముగ్గురు అరెస్ట్

రూ.28 లక్షలు విలువ గల సొత్తు స్వాధీనం



మాట్లాడుతున్న క్రైం డీసీపీ జి.నాగన్న

అల్లిపురం (విశాఖ దక్షిణం): వివిధ కేసుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.28 లక్షలు విలువ గల 17 తులాల బంగారు ఆభరణాలు, అర కేజీ వెండి, రూ.9.లక్షల 5వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో నగర క్రైం డీసీపీ జి.నాగన్న విలేకరులకు వివరాలు వెల్లడించారు.

మంచినీళ్లు అడిగి.. : పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద, సప్తగిరి కాలనీ, ఎంఐజీ-2, ప్లాట్ నంబరు-32లో నివసిస్తున్న సోమయాజుల సుబ్బలక్ష్మి(72) ఈ నెల 24వ తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో స్నానానికి వెళ్తూ మెడలోని పుస్తెలతాడు, నల్ల పూసలు, బంగారు ముత్యాల చైన్ హాల్‌లో టేబుల్‌పై పెట్టారు. అనంతరం ఆమె బయటకు వచ్చేసరికి. ఓ మహిళ జీవీఎంసీ పారిశుధ్య కార్మికురాలినని చెప్పి మంచినీరు అడిగింది. ఆమె మంచినీళ్లు తెచ్చేందుకు లోపలకు వెళ్లి వచ్చేలోగా ఆ మహిళ టేబుల్‌పై ఉన్న బంగారు వస్తువులను తీసుకొని పరారైంది. బాధితురాలు వృద్ధాప్యం వల్ల ఆమె వెంట పరిగెత్తేలేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. పీఎం పాలెం క్రైం పోలీసులు, నార్త్ ఏసీపీ డి.రమేష్ పర్యవేక్షణలో క్రైం ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి సీసీ ఫుటేజీలో ఆమె వేసుకున్న డ్రస్ ఆధారంగా కొమ్మాదిలోని ప్రణవ్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్య పత్తి దుర్గగా గుర్తించారు. నిందితురాలిని బుధవారం ఉదయం అయ్యప్పనగర్‌రోడ్, కొమ్మాదిలో అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో.. : నిందితురాలిని ప్రశ్నించిన సమయంలో ఆమె గత ఏడాది ఏప్రిల్‌లో చేసిన దొంగతనం బయటపడింది. ఆమె ఉంటున్న అపార్టుమెంట్‌లో వాటర్‌కేన్ వేసేందుకు వెళ్లి ఓ ఇంట్లో సుమారు 85 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు పేర్కొంది. దీంతో ఆ ఆభరణాలను కూడా రికవరీ చేసినట్లు తెలిపారు. తన భర్త ఆదాయం సరిపోవడం లేదని, తన తండ్రికి అనారోగ్యం కారణంగా సుమారు రూ.9లక్షలు అప్పు చేసినట్లు.. ఆ అప్పులు తీర్చేందుకు దొంగతనం చేసినట్లు నిందితురాలు వెల్లడించిందని చెప్పారు.

నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి..

శంకరమఠం రోడ్డులో గల సువర్ణ సింబల్ ఎస్టేట్‌ల పేరుతో బండారు రవి, గట్టిరెడ్డి నాయుడులు కార్యాలయం నిర్వహిస్తున్నారు. వీరి వద్ద సీతంపేట ప్రాంతానికి చెందిన వంటకు సూర్యనారాయణ ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన ఆఫీస్ టేబుల్‌లో ఉంచిన రూ.9 లక్షల 5వేలు దొంగతనం జరిగింది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈస్ట్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, క్రైం ఎస్ఐ ఖగేశ్వరరావు తమ సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సూర్యనారాయణను ఈ నెల 21వ తేదీన రైల్వే స్టేషన్ దరి సీఎంఆర్ బస్టాప్‌లో అదుపులోకి తీసుకుని, పోయిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎల్రక్టీషియన్, ప్లంబర్‌గా పగలు ఇళ్లకు వచ్చి రాత్రుళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని నాల్గవ పట్టణ పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం, ఒమ్మి గ్రామానికి చెందిన నల్ల స్వాతికుమార్, రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వరకాలనీలో నివసిస్తున్నాడు. ఇతను వృత్తి పరంగా ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన తాటిచెట్లపాలెం, సంతోషిమాత దేవాలయం వద్ద నివసిస్తున్న సదరం సురేష్ ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో సుమారు 186.5 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించాడు. అదే విధంగా గత ఏడాది జూలై 11వ తేదీన వెంకటేశ్వరకాలనీలో గల లక్ష్మి ఇంట్లోకి రాత్రి సమయంలో ప్రవేశించి బీరువాలోని 3, 3/4 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించాడు.

టూటౌన్ పరిధిలో.. : సౌత్ జైలురోడ్డు, డీఆర్ఎం కార్యాలయం వెనుక గల రైల్వే క్వార్టర్స్‌లో నివసిస్తున్న బలగ వెంకట రమణమూర్తి ఇంట్లోకి నిందితుడు ప్రవేశించి బీరువాలోని సుమారు 400 గ్రాముల వెండి పూజ సామగ్రి అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నగర క్రైం డీసీపీ జి.నాగన్న ఆదేశాల మేరకు డీసీపీ క్రైం డి.గంగాధరం, ఏడీసీపీ క్రైం డి.సూర్యశ్రావణ్‌కుమార్ ఉత్తర్వుల మేరకు ఈస్ట్ క్రైం సీఐ ఎర్రంనాయుడు తమ సిబ్బందితో కలసి నిందితుడు నల్ల స్వాతికుమార్‌ను బుధవారం దొండపర్తి, శ్రీ సూర్య జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నారు. మూడు నేరాలలో పోయిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందికి అభినందనలు : సాంకేతికత సహాయంతో నిందితులను సకాలంలో గుర్తించి.. సొత్తును స్వాధీనం చేసుకున్న సిబ్బందిని క్రైం డీసీపీ జి.నాగన్న, నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తరపున అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

ఈదురుగాలుల బీభత్సం

దెబ్బతిన్న పాఠశాల షెడ్డు

ముంచంగిపుట్టు: మండలంలోని దొడిపుట్టు పంచాయతీ బీడీచంపా గ్రామంలో ఈదురు గాలులకు తాత్కాలికంగా నిర్మించుకున్న పాఠశాల రేకుల షెడ్డు నేలమట్టమైయింది. ఆ సమయంలో పాఠశాలలో 16 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బీడీచంపా గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు పూర్తిస్థాయిలో భవనం లేక రేకులతో తాత్కాలిక భవనం ఏర్పాటు చేసి తరగతులు కొనసాగిస్తున్నారు.ఈ క్రమంలో బుధవారం ఉదయం భారీ వర్షంతో పాటు ఈదురు గాలులకు పాఠశాల రేకుల షెడ్డు ఒక్కసారిగా నేలమట్టమైయింది. ఆ సమయంలో బోధిస్తున్న భాషా వలంటీర్ కామేశ్వరరావు, 16 మంది విద్యార్థులపై రేకులు పడ్డాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వైపు పరుగులు పెట్టి రేకులను తొలగించి, విద్యార్థులను బయటకు తీశారు. ఎవరికి పెద్ద గాయాలు కాలేదు. కొంత మంది విద్యార్థులకు స్వల్ప గాయ్యాలవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.పాఠశాలకు పూర్తిస్థాయిలో భవనం మంజూరు చేసి, విద్యార్థులకు భవన సమస్య తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు భీమేష్, జుల్‌మే, కొమలి, పాంగి పార్వతితో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

కిండలం బాధితులకు సాయం

- ఒకొక్క కుటుంబానికి రూ.10 వేలు
- అందజేసిన అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పెదబయలు: మండలంలోని కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామానికి చెందిన ఏడు కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. గత నెలలో కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామంలో 20 రోజుల వ్యవధిలో కిముడు చిన్నమ్మ, కిముడు పాప, కిముడు బోడంనాయుడు, కిముడు రాంనాయుడు, కిముడు క్రిష్ణంనాయుడు, వంచరంగి రామన్నదొర, కునెబేరి ఈశ్వరమ్మ వ్యాధులతో మృతి చెందారు. సాధారణ మరణాలే అయినప్పటికీ ప్రభుత్వం తరపున ఒకొక్క కుటుంబానికి రూ.10 వేల చొప్పున బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాల వల్ల జరిగే అనర్థాలపై వారికి వైద్యసిబ్బంది అవగాహన కల్పించారన్నారు. మృతుల్లో కిముడు బోడంనాయుడు, వంచరంగి రామన్నదొర, కునెబేరి ఈశ్వరమ్మకు వైఎస్సార్ బీమా వర్తిస్తుందన్నారు, ఒకొక్క కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించేందుకు సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. తహసీల్దార్ భాస్కరరావు, ఆర్ఐ కిరణ్‌కుమార్, వీఆర్వోలు గొల్లోరి నవీణ్‌కుమార్, కాతారి సత్యారావు, కిండలం గ్రామ వలంటీర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

శివ హత్య కేసులో మరో ఐదుగురు అరెస్ట్

ఎంవీపీ కాలనీ: విశాఖ జిల్లా మారికవలస ప్రాంతానికి చెందిన రిక్కా జగదీశ్వరరావు అలియాస్ శివ హత్యకేసులో మరో ఐదుగురిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో శివను జాలరిపేటలో నివసిస్తున్న రౌడీషీటర్ సాయి తన అనుచరులు, స్నేహితులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో తిప్పుతూ చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా రణస్థలం దరి కొవ్వాడ వద్ద దారుణంగా హత్య చేసి పూడ్చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై గత వారం కేసు నమోదు చేసి రౌడీ షీటర్ సాయిని అరెస్ట్ చేసిన ఎంవీపీ పోలీసులు తాజాగా మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో పెదజాలరిపేటకు చెందిన పాసి శ్రీనివాస్ (25), కొత్తగాజువాకకు చెందిన జారజపు యశ్వంత్ (25), వెంపటపు పవన్‌కల్యాణ్ (23), పాతగాజువాకకు చెందిన బొడ్డు కృష్ణచైతన్య (21), మచ్చా సాయి (20) ఉన్నారు. ఈ హత్య కేసులో పది మందిని ముద్దాయిలుగా పోలీసులు ప్రకటించగా ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.